**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 308 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 31 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## మావోయిస్టుల్లేని రాష్ట్రంగా ఏపీ

- గడువు కంటే ఓ రోజు ముందే లక్ష్యాన్ని చేరాం
- కేంద్ర కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణరావు సహా 9 మంది లొంగుబాటు
- ఏడాదిన్నరలో ఎన్‌కౌంటర్లలో 18 మంది మృతి
- 106 మంది లొంగుబాటు.. మరో 81 మంది అరెస్టు
- డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వెల్లడి

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువుకు ఒక రోజు ముందే ఆంధ్రప్రదేశ్‌ను మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేశామని డీజీపీ

- మిగతా2లో

# 21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లు





- కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లకిచ్చే ప్రాధాన్యానికి ఇదే నిదర్శనం
- జగన్ ఐదేళ్లలో కట్టింది 6లక్షలే
- ఆయనకేమో ప్యాలెస్.. బడుగుల ఇళ్లపై మాత్రం మీనమేషాలా?
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్రం రూ.28 కోట్ల జరిమానా విధించినా నాటి పాలకులకు సిగ్గు లేదని ధ్వజం
- ప్రతి ఒక్కరూ పీఎన్‌జీ కనెక్షన్ తీసుకోవాలని పిలుపు

'కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తోంది. 21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వడమే దీనికి నిదర్శనం. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం ఆరు లక్షలు మాత్రమే నిర్మించింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2029 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టిస్తామని స్పష్టం చేశారు. విశాఖలో ప్యాలెస్ కట్టుకున్న వ్యక్తి.. పేదల ఇళ్లపై మీనమేషాలు లెక్కించారని మాజీ సీఎం జగన్‌ను ఎద్దేవా చేశారు. గృహ నిర్మాణానికి ఇచ్చిన నిధులు మళ్లించడంతో కేంద్రం రూ.28 కోట్ల జరిమానా విధించినా నాటి పాలకులకు సిగ్గు లేదని ధ్వజమెత్తారు. 48 ఏళ్ల తన రాజకీయ చరిత్రలో అలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని చూడలేదని చంద్రబాబు మండిపడ్డారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం పుదూరులో నిర్మించిన టిడ్కో ఇళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో 2,50,893 ఇళ్లను లబ్ధిదారులకు ఇక్కడి నుంచే అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. లబ్ధిదారులైన ముక్కర అంబిక, షేక్ నూరి గృహాలకు వెళ్లి వారికి నూతన వస్త్రాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారుల ఇంటికి నేమ్ బోర్డును ఆయనే తగిలించారు. అనంతరం లబ్ధిదారులు, ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ముఖ్యాంశాలివీ..

**పేదలకు పక్కా ఇళ్లు.. తెదేపా సిద్ధాంతం**

'పేదలు పక్కా ఇళ్లలో ఉండాలన్నదే తెదేపా సిద్ధాంతం. టిడ్కో సముదాయాల్లో అంగన్‌వాడీ, పాఠశాల, పార్కు, కమ్యూనిటీ హాలు తదితర సదుపాయాలు కల్పించాం. ఇక్కడ పేదలు ఉంటారంటే ఎవరూ నమ్మరు. గతంలో పేదల పొట్టగొడితే.. మేం గృహ నిర్మాణాలు పూర్తిచేసి వారి కళ్లలో ఆనందం చూస్తున్నాం. వైకాపా ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన రూ.920 కోట్లు ఎగ్గొట్టింది. మేం వాటిని మంజూరు చేశాం. మాకు మంచి పేరు

- మిగతా2లో



## పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు: నో చెప్పిన ఇరాన్

పశ్చిమాసియాలో ఘర్షణల ముగింపు కోసం అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తామని పాకిస్థాన్ ప్రకటనలు చేసింది. అయితే పాక్ ప్రయత్నాలకు ఇరాన్ నో చెప్పింది. ఆ విషయంలో తమ ప్రమేయం ఏమీ లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

- మిగతా2లో



## త్వరలో ఒప్పందం కుదరకపోతే.. సర్వనాశనమే: ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ) పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు."ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం.

- మిగతా2లో

## అమరావతిపై విషం కక్కుతున్న జగన్



**అందుకు వైకాపా నాయకుల విమర్శలే నిదర్శనం**

**మంత్రి నారాయణ ధ్వజం**

అమరావతిపై వైకాపా అధినేత జగన్ విషం కక్కుతున్నారని, అందుకు ఆ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని పురపాలకశాఖ

- మిగతా2లో



## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

**'సహజీవన జంటలకు' కూడా కుటుంబ హోదా**

- 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన జనగణన ప్రక్రియ
- ఈసారి జనాభా లెక్కల్లో సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల మార్పు
- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసలైన జనాభా లెక్కల సేకరణ
- జనాభా లెక్కల కోసం 33 ప్రశ్నలతో ప్రశ్నావళి సిద్ధం
- పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయం

- మిగతా2లో

## ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టులో షాక్..

**ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో 3 పిటిషన్ల కొట్టివేత.. చంద్రబాబుకు ఊరట!**



- రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కేసును సీబీఐకి అప్పగించాలంటూ ఆర్కే పిటిషన్
- చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ మరో పిటిషన్
- కేసు విచారణను ఎంపీలు-ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ మూడో పిటిషన్
- ఆర్కే పిటిషన్లకు విచారణార్హత లేదన్న హైకోర్టు

- మిగతా2లో

## అమరావతి చట్టబద్ధత తీర్మానం పనికిరాదు

**మూలపేట పోర్టు సభలో బొత్స సత్యనారాయణ**

రాజధాని అమరావతి చట్టబద్ధత కోసం చేసిన తీర్మానం పనికిరాదని, రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. సోమవారం ఉదయం 'చలో మూలపేట' కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడ కూడలి వద్ద వైకాపా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసి రాజధానిలో ఖర్చు పెడితే ఎప్పటికి పూర్తవుతుందని బొత్స ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3.50 లక్షల కోట్లు అప్పు తెచ్చి

- మిగతా2లో



## అమెరికా విమానాలకు గగనతలాన్ని మూసేసిన స్పెయిన్



అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలుపంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు . ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తోన్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించుకోవడాన్ని ఇప్పటికే స్పెయిన్

- మిగతా2లో

## రూపాయి భారీ పతనం..

**డాలర్ మారకంతో 95 స్థాయికి పడిపోయిన రూపాయి**

- మొదటిసారి 95 స్థాయికి పడిపోయిన రూపాయి
- ఉదయం 130 పైసలు లాభపడి కోలుకున్నట్లుగా కనిపించిన రూపాయి
- సెషన్ ముగిసేసరికి ఆల్ టైమ్ కనిష్ఠానికి పతనం



భారత కరెన్సీ రూపాయి సోమవారం నాడు డాలర్ మారకంతో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ పరిణామాలతో రూపాయి రోజురోజు నష్టపోతోంది. ఈరోజు డాలర్ మారకంతో 95.14 వద్ద కనిష్ఠస్థాయికి పడిపోయింది. రూపాయి 95 స్థాయికి పడిపోవడం ఇది మొదటిసారి. గతవారం కనిష్ఠస్థాయికి పడిపోయిన రూపాయి ఈరోజు ఉదయం కాస్త కోలుకుంది. ఈరోజు ప్రారంభంలో 130 పైసలు లాభపడి

- మిగతా2లో



## నక్సలిజం దాదాపు అంతమైంది

**లోక్ సభలో అమిత్ షా ప్రకటన**

- ఆపరేషన్ కగార్, నక్సలిజం నిర్మూలన చర్యలపై అమిత్ షా ప్రకటన
- ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని వెల్లడి
- ఎన్డీయే వచ్చాక గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయన్న అమిత్ షా
- ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదంటున్న కాంగ్రెస్సే 60 ఏళ్లు పాలించిందని విమర్శ

- మిగతా2లో

# 21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి

వస్తుందనే గత ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదు. టిడ్కో పథకానికి డిపాజిట్లు కట్టిన 82 వేల మందికి రూ.174 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లింది. అవీ ఈ నెలలోనే చెల్లిస్తాం. నివాసానికి పనికిరాని కొండలు, శ్మశానాలు, వాగుల్లో ఇళ్లస్థలాలు ఇచ్చారు. పేదలు ఉండాల్సింది మురికివాడల్లో కాదు.. పరిశుభ్రమైన ప్రాంతాల్లో.

**కుళాయి నుంచి నీళ్లలా..నాబ్ తిప్పితే గ్యాస్**

ప్రతి ఇంటికీ ఒక అన్నలా ఉంటా. భవిష్యత్తులో ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్ ఇస్తాం. దీనికయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ఇప్పుడు కుళాయి తిప్పితే నీరు వచ్చినట్టు, స్టవ్ నాబ్ తిప్పితే గ్యాస్ రావాలి. భద్రత విషయంలోనూ ఇది మంచి పరిణామం. దీపం-2 పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న నగదును వారికి కూడా ఇస్తాం. ప్రజాసేవ చేయడానికి ఆడపడుచులు ముందుకు రావాలి. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఒక్క మహిళా ఎమ్మెల్యేనే ఉన్నారు. రాబోయే రోజుల్లో ఇద్దరు- ముగ్గురు ఉంటారు. పురుషులు కూడా వారిని ప్రోత్సహించాలి.

**సముద్రంలో నిఘాకు రెండు బోట్లు**

కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అటానమస్ షిప్‌యార్డుతో వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయి. తమిళనాడు, పుదుచ్చేరి నుంచి వచ్చి మన ప్రాంతంలో చేపలు పట్టుకుంటామంటే అంగీకరించం. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని నెల్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిస్తున్నా. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సముద్రంలో నిఘా కోసం 20 బోట్లు ఉన్నాయి. వైకాపా సర్కార్ వీటిని నిర్వీర్యం చేసింది. నిఘా కోసం వెంటనే రెండు బోట్లు మంజూరు చేస్తున్నా. మరో నాలుగైదు అందుబాటులోకి తెస్తాం.

**ఓట్లేయకపోతే మీరు కూడా ఎమ్మెల్యే కాలేరు**

వైకాపాకు ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు. ఇది ఇవ్వాల్సింది నేను కాదు.. జనాలు. వచ్చేసారి వారు ఓట్లేయకపోతే మీరు (జగన్) కూడా ఎమ్మెల్యే కాలేరు. నక్సలిజం అంతరించింది. గత ప్రభుత్వంలో తిరుమల ప్రసాదాల్లో కల్తీ నెయ్యి వంటి వ్యవహారాలు జరిగాయి. రోజూ అపచారానికి పాల్పడ్డారు. ఈ విషయంలో ఎవరినీ వదిలిపెట్టను. సామాజిక మాధ్యమాలు, సాక్షి పత్రిక ఉన్నాయని అసత్య ప్రచారం చేస్తే ఊరుకోను.

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం జరిగిన సభలో ట్యాబ్ పట్టుకుని కనిపించారు. లబ్ధిదారులతో మాట్లాడేటప్పుడు టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన వీడియోలు పరిశీలించారు. అనంతరం ప్రసంగించేటప్పుడు కూడా దాన్ని చూస్తూ కొంతసేపు మాట్లాడారు. తొలుత విద్యుత్తు పొదుపు చేసే ఉపకరణాలు అందించేందుకు ఈఈఎస్ఎల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు.

**రూ.140 కోట్లు బ్యాంకులకు కట్టాం**

**నారాయణ, పురపాలక శాఖ మంత్రి**

'నేను అమరావతి నిర్మాణానికి దేశ విదేశాల్లో తిరిగినప్పుడు పేదల ఇళ్లను పరిశీలించా. అక్కడి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు చెబితే అంతకన్నా మిన్నగా చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. షీర్‌వాల్ సాంకేతికతతో టిడ్కో ఇళ్లు నిర్మించాం. మేం ఇళ్లు మంజూరు చేసిన లబ్ధిదారులపై గత ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణం తీసుకుంది. దాంతో వారికి నోటీసులు వచ్చాయి. ప్రభుత్వాలు చేసిన తప్పులకు పేదలు డబ్బులు కట్టకూడదని సీఎం చెప్పడంతో రూ.140 కోట్లు సర్కారే చెల్లించింది' అని మంత్రి నారాయణ తెలిపారు. ఏప్రిల్‌లో నూతన గృహాలు మంజూరవుతాయని ఆ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్, టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు**

ఏప్రిల్ నుంచి నేను ఆకస్మిక తనిఖీలకు వస్తా. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు క్షేత్రస్థాయిలో ఇసుక వంటి సహజ వనరుల దోపిడీ జరుగుతుంటే అడ్డుకుంటా. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఒక్క రూపాయి అవినీతి, ఒక్క నిమిషం ఆలస్యం చేయవద్దు. పనిచేయని వారిని ప్రజల ముందుంచి ప్రశ్నిస్తా. ఏ శాఖ పనితీరు ఎలా ఉందో రియల్‌టైమ్‌లో గమనిస్తున్నా.

# మావోయిస్టుల్లేని రాష్ట్రంగా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

హరీష్‌కుమార్ గుప్తా ప్రకటించారు. సోమవారం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి చెల్లూరి నారాయణరావు (56) ఎలియాస్ సురేష్‌తో పాటు మరో 8 మంది మావోయిస్టుల లొంగుబాటుతో ఏపీలో మావోయిస్టుల కథ ముగిసిపోయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిఘా విభాగాధిపతి మహేష్ చంద్ర లడ్డా, ఎస్ఐబీ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ, ఎస్ఐబీ ఎస్పీ గీతాదేవితో కలిసి డీజీపీ విలేకర్లతో మాట్లాడారు. 'గత ఏడాదిన్నర వ్యవధిలో ఏపీలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనల్లో కేంద్ర కమిటీ సభ్యులు మడివి హిడ్మా, గాజర్ల రవి ఎలియాస్ ఉదయ్, మెట్టూరి జోగారావు ఎలియాస్ టెక్ శంకర్‌తో పాటు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు వెంకట రవి చైతన్య ఎలియాస్ అరుణ, కాకూరి పండన్న ఎలియాస్ జగన్, మడకం రాజే సహా మొత్తం 18 మంది మావోయిస్టులు మరణించారు. మరో 81 మందిని అరెస్టు చేశాం. ఇంకో 106 మంది లొంగిపోయారు. మొత్తం 120 ఆయుధాలు రికవరీ చేశాం. ఇంకా ఆయుధ డంప్‌ల కోసం వెతుకుతున్నాం. వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించటంలో ఎస్ఐబీ, గ్రేహౌండ్స్, నిఘా విభాగం, జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది బాగా పనిచేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు నిబంధనల ప్రకారం నగదు రివార్డులు అందజేస్తాం. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం' అని చెప్పారు. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.20 వేల నగదు అందజేశారు.

విలేకర్ల సమావేశంలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా. చిత్రంలో శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ మధుసూధన్ రెడ్డి, నిఘా విభాగాధిపతి మహేశ్‌చంద్ర లడ్డా, ఎస్ఐబీ ఐజీ రామకృష్ణ, ఎస్ఐబీ ఎస్పీ గీతాదేవి

**లొంగిపోయిన వారి నేపథ్యమిదే..**

1. చెల్లూరి నారాయణరావు ఎలియాస్ సురేష్, కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం పంచాయతీ పెదవంక గ్రామానికి చెందిన చెల్లూరి నారాయణరావు ఎలియాస్ సురేష్ 1990లో పీపుల్స్ వార్ గెరిల్లాల్లో శ్రీకాకుళంలోని కొండబారిడి దళంలో సభ్యుడిగా చేరారు. 1994 నాటికి ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగి కొండబారిడి, చందనగిరి, ఉద్దానం ప్రాంతాల్లో పనిచేశారు. తర్వాత డివిజనల్ కమిటీ సభ్యుడి హోదాలో స్పెషల్ గెరిల్లా స్క్వాడ్స్ కమాండర్‌గా పనిచేశారు. 2003లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది.. స్టేట్ మిలటరీ కమిషన్ బాధ్యతలు చూశారు. 2009లో మావోయిస్టు పార్టీ 3వ సీఆర్‌సీని ఏర్పాటు చేయగా.. దానికి కమాండర్‌గా వ్యవహరించారు. 2016 నుంచి స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. 2022 సెప్టెంబరులో కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా పదోన్నతి పొంది.. అప్పటి నుంచి అదే హోదాలో కొనసాగుతున్నారు. 2018లో జరిగిన అప్పటి అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో నారాయణరావు నిందితుడు. 1997లో కాశీబుగ్గలో హెడ్ కానిస్టేబుల్ ఎం.నరేంద్రదాస్, 2001లో విజయనగరంలో సీఐ ముద్దాడ గాంధీ హత్య కేసుల్లోనూ నిందితుడిగా ఉన్నారు నీలభద్ర, కొరాపుట్, కూనేరు రైల్వేస్టేషన్‌పై దాడి, నయాగఢ్ ప్రాంతంలో దాడుల్లో పాల్గొన్నారు. ఆయనపై రూ.25 లక్షల నగదు రివార్డు ఉంది.

# అమరావతిపై విషం కక్కుతున్న జగన్

-మొదటిపేజీ తరువాయి

మంత్రి పి.నారాయణ ఆరోపించారు. సోమవారం రాత్రి నెల్లూరులోని 53, 54 డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2015లో అసెంబ్లీ సాక్షిగా 30 వేల ఎకరాలు అవసరమని వైకాపావారు ప్రకటించి అధికారంలోకి రాగానే మాట మార్చి మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. అమరావతిని ప్రపంచంలోనే టాప్-5 రాజధానుల్లో ఒకటిగా నిలబెట్టేందుకు శ్రమిస్తున్నామని, దాన్ని చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారన్నారు. వైకాపా పాలనలో ఖజానా ఖాళీ అయింది కాబట్టి రాజధాని కట్టలేరని జగన్ భావించారని, కేంద్ర ప్రభుత్వ సహాయంతో నిర్మాణం చేస్తున్నామన్నారు. జగన్, ధర్మాన, బొత్స, సజ్జల మాటల్లో పొంతన లేదని ఆరోపించారు. అమరావతిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపడం వారికి నచ్చడం లేదని, శాడిజం ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతి రాజధానిపై జగన్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీరు మార్చుకోకుంటే వైకాపాకు వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావన్నారు.

# అమరావతి చట్టబద్ధత తీర్మానం పనికిరాదు

-మొదటిపేజీ తరువాయి

అందులో రూ.వెయ్యి కోట్లయినా పేద ప్రజల కోసం ఖర్చు చేశారా అని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిలదీశారు. తీర్మానం చేస్తే రాజధాని నిలుస్తుందా..? అమరావతి జపం తప్ప మిగిలిన ప్రాంతాల అభివృద్ధి పట్టదా అని ప్రశ్నించారు. అప్పట్లో పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లో పెట్టి అభివృద్ధి చేశారని చివరికి అక్కడి నుంచి తరలిరావాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు మళ్లీ అమరావతిలో పెట్టుబడి పెట్టి ఆ ప్రాంతాన్ని మాత్రమే అభివృద్ధి చేస్తున్నారన్నారు. శాసనసభ పెట్టుకొని ఇక్కడే రాజధాని ఉండాలని చెప్పి దిల్లీకి కాగితం పట్టుకొని వెళుతున్నారని, తర్వాత వచ్చిన ప్రభుత్వం అక్కడ రాజధాని పనికి రాదంటే ఏం చేస్తారని ప్రశ్నించారు. మన రాష్ట్రంలో రాజధాని ఎన్నో సార్లు మారిందని, అమరావతి నుంచి ఇంకో ప్రాంతానికి రాజధాని వెళ్లదా అని అడిగారు. రూ.లక్షల కోట్లు అమరావతిలో పెడితే ఆ ప్రాంతమే అభివృద్ధి చెందుతుందని.. అమరావతి చుట్టూ ఉన్నవారు అప్పుడు అమరావతిని వదిలేసి వెళ్లిపోండని ఇతరులను అంటే అప్పుడు ఏం చేయాలని ధర్మాన ప్రసాదరావు సందేహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఉన్న సంపదను తీసుకెళ్లి అమరావతిలో కేంద్రీకృతం చేస్తున్న వ్యక్తుల్ని కాల్చేయాలని వ్యాఖ్యానించారు.

# దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై 'కుటుంబం'గా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఈరోజు వివరాలను వెల్లడించారు.

**రెండు దశల్లో జనగణన:**

తొలి దశ (ఏప్రిల్ 1 నుంచి): ఈ దశలో 'గృహ గణన' చేపడతారు. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి గృహాల వివరాలను సేకరిస్తారు.

రెండో దశ (వచ్చే ఏడాది ఫిబ్రవరి): ఈ దశలో అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది.

జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్ నుంచి కారు వరకు), టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు.

ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే (గావశ్రీట జుఅబఎవతీథ్‌ఆశీఅ) అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి.

# ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టులో షాక్..

ఏపీ రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన మూడు పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈరోజు కొట్టివేసింది. ఈ పిటిషన్లకు చట్టబద్ధంగా విచారణార్హత లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఇతర నిందితులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు దర్యాప్తును రాష్ట్ర ఏజెన్సీల నుంచి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించాలంటూ ఒక పిటిషన్... ఇదే కేసులో చంద్రబాబుకు గతంలో మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ మరో పిటిషన్... ఏసీబీ కోర్టులో ఉన్న ఈ కేసు విచారణను ఎంపీలు-ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ మూడో పిటిషన్ ను ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేశారు. ఈ మూడు పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాజకీయ కారణాలతో లేదా ఇతర ఉద్దేశాలతో వేసిన పిటిషన్లుగా వీటిని పరిగణించింది. ఈ పిటిషన్లను కొనసాగించాల్సిన అవసరం లేదని, వీటికి చట్టపరమైన విచారణార్హత లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది.

# అమెరికా విమానాలకు గగనతలాన్ని మూసేసిన స్పెయిన్

-మొదటిపేజీ తరువాయి

నిరాకరించింది. "ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వినియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏకపక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది" అని రక్షణ, ఆర్థిక మంత్రులు స్థానిక మీడియాకు వెల్లడించారు. ఇరాన్ (×తీఱఅ) పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తోన్న యుద్ధాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఈ దేశంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆ దేశంతో వాణిజ్యాన్ని నిలిపేస్తామని హెచ్చరించారు.

## నక్సలిజం దాదాపు అంతమైంది

నక్సలిజం దాదాపు అంతమైందని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారు. ఆయుధాలు పట్టుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని నక్సలిజాన్ని సమర్థించేవాళ్లు తెలుసుకోవాలని హితవు పలికారు. ఆపరేషన్ కగార్, నక్సలిజం నిర్మూలన చర్యలపై ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ, మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని తెలిపారు. సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని తెలిపారు. ఆయుధాలు పట్టడం సరైన చర్య కాదని ఆయన పేర్కొన్నారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నా, ఆదివాసీల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు. ఎన్డీయే వచ్చాక గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయని అన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి జరగలేదో చెప్పాలని నిలదీశారు. నక్సలిజం పేదరికం వల్ల విస్తరించలేదని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టులు పలు ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపారని, అభివృద్ధి పనులను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఓటు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని కొందరు కోరుతున్నారని, కానీ వారి హింసకు బలైన వారి గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. నక్సలిజాన్ని దెబ్బతీసిన ఘనత ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బలగాలకే దక్కుతుందని అన్నారు. "సమస్యలను ఆయుధాల ద్వారా కాదు, చర్చల ద్వారానే పరిష్కరించగలం" అని ఆయన పిలుపునిచ్చారు. అయితే ఆయుధాలు విడిచిపెట్టిన వారితో మాత్రమే చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బస్తర్‌లోని ఆదివాసీలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను అందిస్తోందని అన్నారు. ఇది మోదీ ప్రభుత్వమని, ఆయుధాలు పట్టుకుంటామంటే కుదరదని స్పష్టం చేశారు. ఆదివాసీల అభివద్ధి జరగలేదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, కానీ 60 ఏళ్లు వారే పాలించారని గుర్తించాలని ఎద్దేవా చేశారు. ఇప్పుడు తమపై నిందలు మోపే ప్రయత్నం సరికాదని అన్నారు. ఏడాది కాలంలో 706 మంది మావోయిస్టులు మృతి చెందారని, 4800 మంది లొంగిపోయారని అమిత్ షా ప్రకటించారు.

## పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు: నో చెప్పిన ఇరాన్

-మొదటిపేజీ తరువాయి

"అమెరికాతో ప్రత్యక్ష చర్చలు ఏమీ లేవు. అవన్నీ మధ్యవర్తుల ద్వారా బయటకు వచ్చిన అసమంజసమైన డిమాండ్లు మాత్రమే. దౌత్యం విషయంలో అమెరికా తరచూ మాటమారుస్తోంది. మా వైఖరి మాత్రం స్పష్టంగా ఉంది. పాక్ మధ్యవర్తిత్వ ప్రణాళికలు వారి సొంతమే. వాటిలో మా ప్రమేయం లేదు. యుద్ధం ముగింపు కోసం ఇస్తున్న పిలుపు స్వాగతించదగినదే. కానీ యుద్ధాన్ని ప్రారంభించింది ఎవరో గుర్తుంచుకోండి" అని కాన్సులేట్ జనరల్ పేర్కొంది. ఇటీవల ఇస్లామాబాద్‌లో పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో సౌదీ అరేబియా, ఈజిప్ట్, తుర్కియే మంత్రులు సమావేశమయ్యారు. ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా ఘర్షణల కారణంగా మిగిలిన దేశాలపై పడుతోన్న ప్రభావం గురించి చర్చించారు. పాక్‌లో జరగబోయే ఇరాన్-అమెరికా ప్రత్యక్ష చర్చలకు ఆ దేశాల మంత్రులు పూర్తి మద్దతు ఇచ్చారని ఇషాక్ ప్రకటించారు. ఈ విషయంలో ఇరాన్, యూఎస్ఏ యంత్రాంగంతో చర్చలు జరిపామని చెప్పారు. ఇప్పుడు ఈ ప్రయత్నాల్లో తమ ప్రమేయం ఏమీ లేదని ఇరాన్ (×తీఱఅ) చెప్పడం గమనార్హం.

# త్వరలో ఒప్పందం కుదరకపోతే.. సర్వనాశనమే: ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ప్లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం" అని హెచ్చరించారు.

**ఇరాన్‌కు బలగాలను పంపబోం: బ్రిటన్ ప్రధాని**

ఇరాన్‌కు తమ సైనిక బలగాలను పంపే అవకాశాలను బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తోసిపుచ్చారు. "ఇది మా యుద్ధం కాదు. మేం అందులోకి అడుగుపెట్టబోం. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి మా వంతు ప్రయత్నాలు కొనసాగిస్తాం" అని తెలిపారు. ఇరాన్‌పై దాడుల కోసం తన స్థావరాలను అమెరికా ఉపయోగించుకునేందుకు బ్రిటన్ ఇప్పటికే ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడానికి యుద్ధ విమానాలను కూడా మోహరించింది.

## రూపాయి భారీ పతనం..

-మొదటిపేజీ తరువాయి

93.59 వద్ద ప్రారంభమైంది. కానీ సెషన్ ముగిసేసరికి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరుకుంది.

రూపాయి బలహీనతకు ఎన్నో కారణాలు ఉన్నాయి. పశ్చిమాసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 109 డాలర్లకు పైన ఉంది. దీనితో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ నెలలో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి సుమారు 11.5 బిలియన్ డాలర్లను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. గత శుక్రవారం సుమారు రూ.850 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను విదేశీ పెట్టుబడిదారులు విక్రయించారు. ఇలా వివిధ కారణాలతో రూపాయి అత్యంత బలహీనమవుతోంది.

# అంబేద్కర్ 136 వ జయంతి కరపత్రం విడుదల చేసిన మంత్రి సవిత.



**పెనుకొండ, పెన్ సత్తా, మార్చి 30:**శ్రీ సత్య సాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గ కేంద్రములో బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత స్వగృహంలో భారత రత్న డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 వ తేదీన పెనుకొండలో జరిగే జై భీమ్ ర్యాలీ, జయంతి సభ కి చెందిన కరపత్రాన్ని విడుదల చేసిన బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత. అలాగే పెనుకొండ లో వై జంక్షన్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు జరిగే జై భీమ్ ర్యాలీ, జూనియర్ కాలేజీ మైదానంలో జరిగే జయంతి సభ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మంత్రి సవిత ని ఆహ్వానించిన బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హై కోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుకొండ రవికుమార్, ఉపాధ్యక్షులు రంగేపల్లి నాగరాజు, రాష్ట్ర మైనారిటీ వింగ్ అధ్యక్షులు యాంద్రసు, జిల్లా యూత్ లీడర్ శశికుమార్ తదితరులు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ నేను ఖచ్చితంగా ఈ భీమ్ ర్యాలీ, జయంతి సభలో పాల్గొంటాను అని, అలాగే మహనీయుడు డా.బి.ఆర్ అంబేద్కర్ పోరాట, కృషి ఫలితముగా సమాన హక్కులు, సామాజిక న్యాయం లభించాయన్నారు. అలాగే మహిళ సాధికారత కోసం ఎన్నో పోరాటలు చేశారు అని హర్షం వ్యక్తం చేసిన మంత్రి సవిత.

# ఘనంగా పి4 కార్యక్రమ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు.

- పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతతో పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలి.
- ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.
- దేశంలోనే మొదటిసారిగా కేసరపల్లిలో ఉచిత ఏఐ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం.







**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 30:**సమాజం లోని ఆర్థిక అసమానతలను తొలగించి, పేద కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గన్నవరం లోని రాయ్ నగర్ కళ్యాణ మండపంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ కాలంలో ప్రభుత్వ నిధుల పైనే ఆధారపడకుండా దాతల సహకారం తోనే పాఠశాలలు, ఆలయాల నిర్మాణాలు జరిగేవని, అదే స్ఫూర్తిని నేటి తరంలో మళ్లీ పెంపొందించడమే ఈ పథకం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గంలో అనేక చిన్న తరహా పరిశ్రమలు ఉన్నప్పటికీ, పి4 కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యాల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో లేదని యార్లగడ్డ అభిప్రాయపడ్డారు. పారిశ్రామికవేత్తలు నేను సైతం అంటూ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి, పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా, సామాజిక అవసరాల తీర్చడంలో పాలుపంచు కోవడం ద్వారా నియోజకవర్గంలో మార్గదర్శుల సంఖ్య పెరుగుతుందని, తద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన పిలుపు నిచ్చారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రం లోనే కాకుండా దేశం లోనే మొదటిసారిగా గన్నవరం నియోజకవర్గం లోని కేసరపల్లిలో ఉచిత ఏఐ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కేంద్రం పనులు మార్చి నెలలోనే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యమైందని, కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఈ బాధ్యతను తీసుకుందని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ షాహిద్ అందించిన వివరాల ప్రకారం ఏప్రిల్ 15 నాటికి ఈ ఏఐ శిక్షణ కేంద్రం అందుబాటు లోకి వస్తుందని వెల్లడించారు. 90 వ దశకంలో మెయిన్ ఫ్రేమ్స్, కోబాల్ నేర్చుకున్న వారు ఏ విధంగా స్థిరపడ్డారో, నేడు ప్రపంచమంతా ఏఐ వైపు చూస్తున్న తరుణంలో ఈ శిక్షణ కేంద్రం స్థానిక నిరుద్యోగ యువతకు, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఒక గేమ్ ఛేంజర్ లా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తక్కువ ప్యాకేజీలకే పరిమితం కాకుండా ఉన్నత మైన ఐటీ ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ఇది అద్భుతమైన వేదిక అవుతుందని వివరించారు. పి4 కార్యక్రమం కోసం హెచ్‌సీఎల్ కంపెనీ ఇప్పటికే 50 లక్షల రూపాయలు కేటాయించడం అభినందనీయమని పేర్కొంటూనే, ఇతర పరిశ్రమలు కూడా మరింత పెద్ద ఎత్తున సహకరించాలని కోరారు. అంతకు ముందు, గన్నవరం మండలం దావాజీగూడెం లోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌లో హెచ్‌సీఎల్ ఫౌండేషన్, సోచారా, సంయుక్త సంస్థల ఆధ్వర్యంలో పి4 పథకం కింద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ను యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి షేక్ షాహిద్ బాబు, గన్నవరం ఏండిఓ స్వర్ణలత, బుద్ధవరం గ్రామ సర్పంచ్ బడుగు బాలమ్మ, బాపులపాడు ఎండిఓ జోగేశ్వరరావు, వార్డెన్ కె.శోభా, హెచ్.సీ.ఎల్ టెక్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు, సోచార సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్, వినీల, ఉదయ్ కిరణ్, టిడిపి నాయకులు గూడపాటి తులసిమోహన్, కొలుసు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో పేదల సొంతింటి కల సాకారం.





- లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేసిన జిల్లా కలెక్టర్, కోణతాల.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 30**: పేదలకు సొంతింటి కల సాకారం చేయాలనే సంకల్పంతో మన ఇల్లు, మన గౌరవం నినాదంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అనకాపల్లి మండలం మారేడు పూడి గ్రామంలో, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపట్టిన ఇళ్లను సోమవారం అనకాపల్లి ఎమ్మెల్యే కోణతాల రామకృష్ణ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ల తో కలిసి జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ గృహ యజమానులకు తాళాలు అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ఈ ఇల్లు పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదిగా, కుటుంబాన్ని భద్రతగా ఉండాలని, జీవితంలో ఆనందం ఆత్మ విశ్వాసం అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 2,50,893 లక్షల ఇళ్లను, అనకాపల్లి జిల్లాలో రూ.42.41 కోట్లతో 10,414 ఇళ్లను, నియోజకవర్గంలో రూ.16.55 కోట్లతో 1,868 పూర్తి చేసి, పేదలను ఇంటి యజమానులను చేశామన్నారు. అతి త్వరలోనే ఈ ప్రాంతానికి మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సొంతింటి కలను సాకారం చేసుకున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ప్రణాళిక బద్దంగా ఇళ్ల నిర్మాణాలను ఇచ్చిన మాట ప్రకారం 20 నెలల వ్యవధిలో పూర్తి చేసి అందజేసిదన్నారు.

కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పి డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, సిహెచ్ఎన్ అగ్రహారం పిఏసిఎస్ చైర్మన్ బంటు రవి, ఎంపీటీసీ చదర నాగేశ్వరావు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.



# టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఘనంగా అందజేత.

- పేదల సొంతింటి కల సాకారం చేసిన కూటమి ప్రభుత్వం.
- చంద్రబాబు సంకల్పం ఫలించింది, టిడ్కో ఇళ్లతో పేదల జీవితాల్లో కొత్త వెలుగు.
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు.






**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 30:** రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం పేదల జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గాజువాక నియోజకవర్గం పరిధిలో తలారువానిపాలెంలో టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది. విశాఖపట్నం ఇంచార్జ్ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు లబ్ధిదారులకు గృహాలను అందజేశారు. ఈ సందర్భంగా గాజువాకలో 1,393 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పేదల గృహ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసిందన్నారు. ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. గతేడాది తొలి విడతలో 3 లక్షల ఇళ్లను పంపిణీ చేయగా, ఇప్పుడు రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తంగా గత 21 నెలల కాలంలోనే 5.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం ప్రభుత్వ పనితీరు, సంకల్పబలం స్పష్టంచేస్తోందన్నారు. 2019 నాటికే పూర్తయిన ఇళ్లను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేసి, కేవలం రంగులు మార్చే పేరుతో సుమారు రూ.300 కోట్లు దుర్వినియోగం చేసిందని పల్లా ఆరోపించారు. మౌలిక వసతులు కల్పించకుండా, సిమెంట్ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, ఎస్టీపీ వంటి అవసరాలను పట్టించు కోకుండా ఇళ్లను ఖాళీగా ఉంచడం వైసీపీ పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇళ్ల కోసం డబ్బులు చెల్లించిన లబ్ధిదారులను మభ్యపెట్టి ఇళ్లను అందించకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే నిధులు సమీకరించి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి గృహాలకు జీవం పోసిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పరిపాలనా నైపుణ్యంతో పేదల గృహ కలను సాకారం చేస్తోందన్నారు. సంక్షేమం--అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగే పాలనకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో మరింత వేగంతో గృహ నిర్మాణం, పంపిణీ కార్యక్రమాలను విస్తరిస్తూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# నూకాంబికను దర్శించుకున్న గంగాధర్ శాస్త్రి





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 30:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగ గుర్తింపు పొంది, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో కొత్త అమావాస్య రాష్ట్ర జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం ప్రముఖ నాటిక అకాడమీ అవార్డు గ్రహీత, గీతా గాన ప్రవచన కర్త, వ్యవస్థాపక అధ్యక్షులు భగవద్గీత ఫౌండేషన్, డాక్టర్ ఎల్ వి గంగాధర్ శాస్త్రి

అమ్మవారికి దర్శించుకొని, ప్రత్యేక పూజల నిర్వహించారు. ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు,

కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులకు ప్రతిష్టాత్మక డి.జి.పి. కమండేషన్ డిస్క్ అవార్డులు

14 మందికి డి.జి.పి. కమండేషన్ డిస్క్ అవార్డులు.





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 30**: పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, అసాధారణ ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఇచ్చే ప్రతిష్టాత్మక డి.జి.పి. కమండేషన్ డిస్క్ అవార్డులు 2025 సంవత్సరానికి గాను ప్రకటించ బడ్డాయి. ఈ పతకాల జాబితాలో అనకాపల్లి జిల్లాకు చెందిన 14 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది చోటు సంపాదించు కోవడం జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచింది. ఈ 14 అవార్డులలో 3 సిల్వర్ (వెండి), 11 బ్రాంజ్ (కాంస్య) పతకాలు ఉన్నాయి.

డీజీపీ సిల్వర్ డిస్క్ గ్రహీతలు

ఎల్.అప్పారావు పీసీ-2340 (సబ్బవరం పి.ఎస్.), వై.నరసింహ మూర్తి పీసీ-255 (కె.డి.పేట పి.ఎస్.), కె.రమణ పీసీ-418 (మునగపాక పి.ఎస్.), డీజీపీ బ్రాంజ్ డిస్క్ గ్రహీతలు: వై.తారకేశ్వర రావు ఎస్సై (కె.డి. పేట పి.ఎస్.), బి.సురేష్ బాబు ఎస్సై (ఐ.టి కోర్), బి.అప్పారావు ఏఎస్సై-886 (కొత్తకోట పి.ఎస్.),
బి.శ్రీనివాస రావు హెచ్.సి-1528 (సబ్బవరం పి.ఎస్.), ఎం.హేమంత కుమార్ హెచ్.సి-1544 (డి.సి.ఆర్.బి),
ఎస్.వరాహ బాబు హెచ్.సి-1486 (డి.ఎస్.బి), కె.చిరంజీవి హెచ్.సి-2003 (కె.డి.పేట పి.ఎస్.), బి.సత్యనారాయణ పీసీ-2331 (పరవాడ పి.ఎస్.),
బి.గోవింద రావు పీసీ-462 (ఐటి కోర్),
పి.ఎస్.జి.పవన్ కుమార్ పీసీ-409 (పాయకరావుపేట పి.ఎస్.), ఏ.ఎస్.కృష్ణ మూర్తి ఏ.ఆర్ పీసీ-2573 (డి.ఏ.ఆర్.)లు వున్నారు. వీరిని ?ఎస్పీ అభినందించి, పురస్కార ప్రదానం చేశారు. ?ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పతకాలు సాధించిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఐటి కోర్ ఎస్సై బి.సురేష్ బాబు, పీసీలు బి.గోవింద రావు, ఏ.ఎస్.కృష్ణ మూర్తి, డి.సి.ఆర్.బి హెచ్.సి ఎం.హేమంత కుమార్ లకు ఎస్పీ స్వయంగా పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ లక్షణా మూర్తి, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమిస్తూ, వృత్తిపర మైన నైపుణ్యాలను ప్రదర్శించాలి. ఇలాంటి అవార్డులు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపుతాయని, భవిష్యత్తులో మరింత మంది సిబ్బంది ప్రశంసాపూర్వక మైన విధులు నిర్వహించి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను అని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు.

## కాగితలో ఉచిత కంటి వైద్య శిబిరం




**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 30:**కాగిత లో హైమా నేత్రాలయ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం జరిగింది. స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టిడిపి నాయకులతో పాటు డాక్టర్ పిఎస్ఆర్ ప్రసాద్ ను స్థానిక నాయకులు సాలువాతో సత్కరించారు. జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు పి.కనకేశ్వరరావు సహకారంతో హైమ నేత్రాలయ-సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి, పాయకరావుపేట వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడపా గణేశ్వరావు, జనసేన నక్కపల్లి మండల కార్యదర్శి దేవవరపు ఉమామహేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, ఉప సర్పంచ్ దేవవరపు రామకృష్ణ, ఐ టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు యర్రంశెట్టి శ్రీను, జనసేన నాయకులు గుండిబిల్లి గంగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంత ఇంటి కల సాకారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.



విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.




**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 30:**పేదల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం మానికొండ గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు నాదెళ్ల పద్మావతి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఏవై) పథకం కింద నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి గృహాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సురక్షిత మైన, సౌకర్యవంత మైన సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పీఎంఏవై పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గృహసౌకర్యం కల్పించడం జరుగుతోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు గౌరవప్రద మైన జీవనం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే నిర్మాణ నాణ్యత పై సంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి, ప్రభుత్వ పథకాల పై అవగాహన కలిగి వాటిని పూర్తిగా వినియోగించు కోవాలని సూచించారు. ఇంకా గ్రామం లోని ఇతర అర్హులైన కుటుంబాలు కూడా ప్రభుత్వ హౌసింగ్ పథకాల ద్వారా లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి షాహిద్ బాబు, ఎంపీడీఓ సత్య కుమార్, ఎమ్మార్వో విమలాకుమారి, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, మానికొండ గ్రామ టిడిపి అధ్యక్షులు యడ్లపల్లి సాయిబాబు, షేక్ అజీజ్, షేక్ ఫిరోజ్, కుందేటి చంద్రశేఖర్, అరికట్ల రవికుమార్, బెజవాడ నాగేశ్వర రావు, తుమ్మల లత, దాసరి రవళి, పొట్లూరి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## రామ్ కీ ఫార్మా సిటీలో భారీగా గంజాయి దగ్ధం.





**పరవాడ, పెన్ సత్తా, మార్చి 30:** మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సిబి),ఈగల్ వింగ్ సంయుక్తంగా భారీ స్థాయిలో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాయి. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లో ఐదు వేర్వేరు కేసుల్లో ఎన్సిబి స్వాధీనం చేసుకున్న సుమారు 1,108 కిలోల గంజాయిని సోమవారం నాడు శాస్త్రీయ పద్ధతిలో దగ్ధం చేశారు.

మండలం లోని, తానం గ్రామం లోని రామ్ కీ ఫార్మా కంపెనీలో ఉన్న అత్యాధునిక ఇన్సినరేషన్ ప్లాంట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్సిబి జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేది, సూపరింటెండెంట్ రాజన్ కుమార్, ఈగల్ ఎస్పీ నగేష్ బాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ డిస్ట్రక్షన్ ప్రక్రియ పూర్తయ్యింది.

బహిరంగంగా కాల్చకుండా, కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ ఇన్సినరేషన్ మెషీన్ ద్వారా గంజాయిని నిర్వీర్యం చేశారు.

ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులతో పాటు ఎన్సిబి విభాగం ఇన్స్పెక్టర్ కె.కిరణ్ బాబు, ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్లు డాక్టర్ కళ్యాణి, ధనుంజయ నాయుడు, అనకాపల్లి ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, డ్రగ్స్ రవాణా పై ఉక్కుపాదం మోపుతున్నామని, యువతను వ్యసనాల బారి నుండి కాపాడేందుకు ఇటువంటి తనిఖీలు, నిర్మూలన చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. పట్టు బడిన మత్తు పదార్థాలను ఎప్పటి కప్పుడు కోర్టు అనుమతితో ఇలాగే ధ్వంసం చేస్తామని పేర్కొన్నారు.



## జర్నలిస్ట్ సోదరులకు అక్రిడేషన్ అందజేసిన కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 30:** జిల్లాలో జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న 351 మందికి మొదట విడతలో అక్రిడేషన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం డి ఎం ఎ సి కమిటీ సభ్యులకు అక్రిడేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ అందజేశారు. డి ఎం ఎ సి కమిటీ సభ్యులు కె చందర్రావు, బొండా గోపీనాథ్ రావు, ఎం వెంకట్రావు పట్నాయక్, ఏ వెంకట అప్పారావు, ఎస్ ప్రసాద్ బాబు, పి నాగ శ్రీనివాసరావు, లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అక్రిడేషన్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. అక్రిడేషన్ పొందిన జర్నలిస్టులకు త్వరలో హెల్త్ చెకప్ చేయించడానికి కృషి చేస్తున్నామన్నారు. అర్హులైన జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్ ని కూడా డి ఐ పి ఆర్ ఓ ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు.



# ఏపీఐఐసి సేకరించిన భూములలో గ్రీన్బెల్ట్ ఏర్పాటు చేయాలి.



ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను కలిసిన గ్రామ పెద్దలు.

**పరవాడ, పెన్ సత్తా, మార్చి 30:**ఏపీఐఐసీ పరవాడ రెవెన్యూ పరిధిలో భూ సేకరణ చేసిన 128.59 ఎకరాల భూములు లో తక్షణమే గ్రీన్ బెల్ట్ ను అభివృద్ధి చేసిన తరువాత మాత్రమే మౌలిక వసతుల అభివృద్ధి పై చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. పరవాడ మండల పరిధిలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక సమస్యల పరిష్కారం కోసం సోమవారం అచ్యుతాపురం లోని ఏపీఐఐసి కార్యాలయంలో జోనల్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాస రావు, గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు తెలిపారు. పరవాడ గ్రామ పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల విస్తరణ కొరకు, పరవాడ రెవెన్యూ పరిధిలో భూ సేకరణ చేసిన భూములు లో 250 మీటర్లు గ్రీన్ బెల్ట్ కొరకు వినియోగించి, రైతుల భూములలో ఎటువంటి గ్రీన్ బెల్ట్ లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సవివరంగా జోనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా భూ సేకరణ సమయంలో రైతులు వద్ద నుండి 2009 సంవత్సరంలో ఏపీఐఐసి ద్వారా సుమారు 128.59 ఎకరాల భూమిని సేకరించినప్పటికీ, ఆ భూములలో గ్రీన్ బెల్ట్ కొరకు స్థలం కేటాయించాలని, గ్రీన్ బెల్ట్ కొరకు స్థలం కేటాయించ కుండా అక్కడ ఎటువంటి అభివృద్ధి పనులు చేయకూడదని, అలా చేసిన ఎడల రైతులు, గ్రామస్థులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, ఇప్పటికే కాలుష్య కోరల్లో చిక్కుకున్న పరవాడ ప్రాంతాన్ని ఇంకా ఇబ్బంది పెట్టవద్దని, రైతులు, గ్రామస్థులు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన రైతులు స్థానిక ప్రజలు ఆశించిన అభివృద్ధి ఫలితాలు అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అలాగే 17 సంవత్సరాలు గడిచినా సరైన రహదారులు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, కాలువలు, నీటి సౌకర్యాలు వంటి కీలక అంశాలు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల పరిశ్రమలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరానికి లోపు పూర్తి స్థాయి ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆ పనుల్లో గ్రామస్థులు కు అన్ని అవకాశాలు ఇవ్వాలని స్పష్టంగా డిమాండ్ చేశారు. పరవాడ గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికులకు, నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గ్రామ పెద్దలు జోనల్ మేనేజర్ నరసింహారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ కె.సూర్యనారాయణ, జె.ఈ రాజేందర్ రెడ్డి లను కోరారు. ఈ వినతి పత్రాన్ని స్వీకరించిన జోనల్ మేనేజర్ సమస్యలను సానుకూలంగా పరిశీలించి పై అధికారులు కు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుక్క రామానాయుడు, పెద్ద చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీను, పయిల సన్యాసి రావు మాస్టారు, పయిల బుజ్జి, వర్రీ చంద్రశేఖర్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నూతన హంగులతో సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపం

ప్రారంభించిన వీసం రామకృష్ణ





**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 30:** మండల కేంద్రం నక్కపల్లి లో గల సుబ్బిరామిరెడ్డి కళ్యాణమండపం నూతన హంగులతో తీర్చిదిద్దారు. టి సుబ్బిరామిరెడ్డి, హెటిరో రసాయన పరిశ్రమ సహకారంతో గతంలో నిర్మించిన ఈ కళ్యాణ మండపం రాజకీయ సమావేశాలు, వివాహాలు, రజస్వల వేడుకలు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఈ కళ్యాణ మండపంలో ఎయిర్ కండిషన్ (ఎ సి ) ఏర్పాటు చేశారు. వీటిని సోమవారం వివిధ పార్టీల నాయకులు, స్థానికులతో కలిసి వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మారేడుపూడిలో అక్రమ ఇంటి నిర్మాణం

- ఏడాది నుంచి చర్యలు లేకపోవడం పై కలెక్టర్‌కు ఫిర్యాదు
- అధికారుల నిర్లక్ష్యం పై బీజేపీ నేత ఆగ్రహం
- ఇప్పటికే అక్రమం అని రిపోర్ట్... అయినా తొలగింపు లేదు.
- తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతి

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 30:**మండలం లోని మారేడుపూడి గ్రామంలో అక్రమంగా నిర్మించబడిన ఇంటి తొలగింపు విషయంలో అధికారుల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న తీరు పై పిర్యాదు. సర్వే నెంబర్ 357 లో నిర్మించిన ఇంటి పై ఇప్పటికే అధికారుల విచారణలో అక్రమ నిర్మాణం జరిగినట్లు నిర్ధారణ చేసారు. 2024 లో అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి నిర్వహించిన విచారణలో ఈ నిర్మాణం నిబంధనలకు విరుద్ధమని స్పష్టమైంది. వెంటనే ఆ ఇంటిని తొలగించాలని అధికారులకు సూచనలు కూడా ఇవ్వబడ్డాయి. అయితే, అనంతరం 22-11-2024 న జిల్లా పంచాయతీ అధికారి నుంచి అనకాపల్లి తహసీల్దార్ కు అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని లేఖ పంపించినప్పటికీ, దాని పై ఇప్పటివరకు ఎలాంటి అమలు జరగలేదు. దాదాపు ఏడాది కాలంగా ఈ విషయం పై తహసీల్దార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మారేడుపూడి గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ నాయకుడు పి. నానాజీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ను కలిసి ఈ అక్రమ నిర్మాణాన్ని అధికారులు తొలగించక పోవడం పై ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించేందుకు అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆయన కలెక్టర్ ని కోరారు. ప్రజా సమస్యల పై స్పందించాల్సిన అధికారుల నిర్లక్ష్యం పట్ల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీని పై వెంటనే చర్యలు తీసుకోవాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం



**నక్కపల్లి, పెన్ సత్తా మార్చి30:**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరుకున్న దృష్ట్యా రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై మండలంలో ఉపాధ్యాయులు కసరత్తు ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి 1 కే .నరేష్ ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ సమావేశంలో పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, స్పెషల్ డ్రైవ్ పై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సమావేశానికి స్థానిక మండల అభివృద్ధి అధికారి బి చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి బడి ఈడు పిల్లలను ముఖ్యంగా 6- 14 వయస్సు వారిని పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న గ్రామాలలో వినూత్న పద్ధతుల ద్వారా ప్రచారం చేయాలన్నారు. వందశాతం పిల్లలను ప్రభుత్వబడులలోనే చేర్చేలా చూడాలన్నారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు .ఇంగ్లీష్ మీడియం లో బోధన. ఆధునిక బోధన విద్యా విధానము వంటి అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక చొరవ చూపే పాఠశాలలకు ఉపాధ్యాయులను అభినందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అందరూ అంకిత భావంతో పనిచేసి, పాఠశాలలో విద్యార్థుల చేరికలపై దృష్టి సారించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో మండలంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా గూడుపమ్మ తల్లి జాతర మహోత్సవాలు





- ప్రతీ రెండేళ్లకోసారి గూడుపమ్మ జాతర
- గ్రామ దేవత నామస్మరణతో ఆధ్యాత్మిక శోభ
- ఈనెల 23 నుండి అమ్మవారి ఘటాలు ఊరేగింపు

**నక్కపల్లి, పెన్ సత్తా మార్చి28 :** మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఈ గ్రామ దేవత గూడుపమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా సోమవారం గూడుపమ్మ తల్లి ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ జాతర వేడుకలను పురస్కరించుకొని ఈనెల 23 నుండి అమ్మవారి ఘటాలను రాత్రి సమయంలో ఘనంగా ఊరేగిస్తున్నారు. అమ్మవారి ఘటాలను భక్తులు దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించుకుంటున్నారు. ఒకప్పుడు రేబాక దట్టమైన అటవీ ప్రాంతంగా వున్నప్పుడు వనదేవతగా గూడుపమ్మతల్లి వెలిశారని పూర్వీకులు చెబుతుంటారు. అప్పటినుండి గూడుపమ్మ పండుగను రెండేళ్ళకు ఒకసారి జాతర నిర్వహిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన అమ్మవారి పూజారులు, గ్రామ పెద్దల సమక్షంలో గత మూడు శతాబ్దాల నుంచి గ్రామ ఆచార, సంప్రదాయల మేరకు పండుగను భక్తి శ్ర ద్ధలతో జరుపుకుంటారు. గ్రామాల్లో ఘటాల ఊరేగింపు రేబాక, మెరక గ్రామాల ప్రజలతో పాటు, అనేక ప్రాంతాలకు చెందిన భక్తులందరికీ గూడుపమ్మతల్లి అంటే ఎంతో నమ్మకం. దీంతో అమ్మవారి ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయం వద్ద భోజనాలు చేసి వెళ్తుంటారు. రెండేళ్లకోసారి జరిగే పండుగను చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఇతర ప్రాంతాల నుంచి వస్తారు. సోమవారం గ్రామంలో పెద్ద ఎత్తున జాతర, ఊరేగింపు, ఊయల ఉత్సవాలు జరుగుతాయని పూజారులు,గ్రామ పెద్దలు చెప్పారు. 31 మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయంలో అమ్మవారి దర్శనాలుంటాయన్నారు.

అదే రోజూ అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని చెప్పారు. గ్రామ పురవీధుల్లో ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకూ కిలో మీటరు పొడవునా భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో భక్తులు తరలివస్తారని అంచనావేస్తున్నారు. నక్కపల్లి సీఐ మురళీ ఆధ్వర్యంలో ఎస్ఐలు సన్నిబాబు, మల్లేశ్వరరావు, సాహిబా అంజుమ్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులంతా అమ్మవారి జాతరలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. దీనిలో భాగంగా కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణికి 143 దరఖాస్తులు

**పెన్ సత్తా మార్చి28** :ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి తో కలిసి అదనపు కలెక్టరు (143) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మందగించిన ఆర్థిక సూచీల వృద్ధి



పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో నెలకొన్న పరిమితులు ఆర్థిక సూచికల వృద్ధి మందగింపును సూచిస్తున్నాయని ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో పేర్కొంది. మార్చి నెలవారీ ఆర్థిక సమీక్షను ఆర్థిక వ్యవహారాల శాఖ (డిఇఎ) శనివారం విడుదల చేసింది. పశ్చిమాసియాతో బలమైన వాణిజ్య, పెట్టుబడి, విదేశాలకు నగదు బదిలీ సంబంధాలు కలిగిన భారతదేశానికి (ప్రధాన ఇంధన దిగుమతిదారు) ఈ సంఘర్షణలు "సంక్లిష్టమైన, బహుళ అంచెల ఆర్థిక ఇబ్బందులను" కలిగిస్తున్నాయని పేర్కొంది. "2026 మార్చి నాటి తొలి ఆర్థిక నివేదికలు ఈ ప్రపంచ పరిణామాల ప్రభావాన్ని ప్రతిబింబించేలా వృద్ధిలో మందగమనాన్ని సూచిస్తున్నాయి" అని నివేదిక తెలిపింది. "మార్చి 22 వరకు నెలవారీ ఇ ? వే బిల్లుల జారీ 5.3 శాతం తగ్గింది. ఇది వస్తువుల రవాణాలో కొంత మందగమనాన్ని సూచిస్తుంది. అయితే వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తే.. ఇది 9.4శాతం అధికంగానే ఉంది. ఇంధన ధరల పెరుగుదల షాక్ తర్వాత ఉత్పత్తి వృద్ధిలో మందగమనాన్ని పిఎంఐ (పర్చేజింగ్ మానేజర్స్ ఇండెక్స్) సూచిస్తోంది" అని నివేదిక తెలిపింది. వాహన రిజిస్ట్రేషన్లు మార్చి 24 వరకు గతేడాదితో పోలిస్తే 19.1శాతం పెరిగాయని, మార్చి 22 వరకు డిజిటల్ చెల్లింపులు రెండంకెల వృద్ధిని కొనసాగించిందని తెలిపింది. గ్రామీణ ఆర్థిక పరిస్థితులు, అభిప్రాయాల సర్వే మార్చి 2026లో గ్రామీణ అభిప్రాయాల్లో కొంత తగ్గుదల ఉన్నట్లు సూచిస్తోంది. అయితే వినియోగ వృద్ధి బలపడింది. ఈ సర్వేను 2026 ఫిబ్రవరి చివరి వారంలో మరియు మార్చి మొదటి వారంలో నిర్వహించినట్లు తెలిపింది.

భారతదేశం చమురు, ఎల్‌పిజి, ఎల్‌ఎన్‌జి అవసరాల కోసం దిగుమతులపై, ముఖ్యంగా పశ్చిమాసియా దేశాలపై ఆధారపడింది. దీంతో నిర్దిష్ట రంగాలపై స్థూల ఆర్థిక ప్రభావాన్ని కూడా నివేదిక చర్చించింది. అనేక రంగాల్లో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలైన గాజు లేదా సిరామిక్స్ వంటి నిరంతరం ఉత్పత్తి కొనసాగే పరిశ్రమలకు ఇంధనాలను, ముడిపదార్థాలు అందకపోవడంతో ఉత్పత్తి కోతకు, తాత్కాలిక మూసివేతకు దారితీశాయని నివేదిక తెలిపింది. లభ్యత లేకపోవడం, వ్యయ పెరుగుదల రెండూ కూడా లాభాల మార్జిన్లు, ఉత్పత్తిపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తున్నాయి. రవాణా అంతరాయాలు, సరఫరా మార్గాల మార్పులు, యుద్ధ ప్రమాద ప్రీమియంలతో సరుకు రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరిగాయని, అదే సమయంలో రవాణా ఆలస్యం కావడం, డెలివరీ సమయాన్ని పొడిగించాయని పేర్కొంది. దీంతో కీలకమైన ముడిసరుకుల దిగుమతులకు, ఎగుమతులకు నిబంధనలు తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపింది.

# 66,500 డాలర్లకు పడిపోయిన బిట్ కాయిన్




ప్రస్తుతం అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్‌లో డిజిటల్ కరెన్సీ అయిన బిట్‌కాయిన్ (ఃతిబిఇనీతిని) తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. గత కొద్ది రోజులుగా బిట్‌కాయిన్ ధర 65,900 నుంచి 66,500 డాలర్ల మధ్య కొనసుగుతోంది.మార్చి 27న 65,720 డాలర్ల కనిష్ట స్థాయికి కూడా పడిపోయింది. గత 24 గంటల్లో సుమారు 1 శాతం, గత వారం రోజుల్లో దాదాపు 4 శాతం మేర విలువను కోల్పోయిన బిట్‌కాయిన్, ఈ ఏడాదిలో ఇప్పటికే మూడుసార్లు ఇదే స్థాయి వద్ద నిలదొక్కుకుంది. అయితే, ఈసారి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ సపోర్ట్ లెవల్ ఎంతవరకు నిలబడుతుందనేది ఇప్పుడు మార్కెట్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

బిట్‌కాయిన్ ధరల ఆకస్మిక పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది మిడిల్ ఈస్ట్ వార్ ఉద్రిక్తల నేపథ్యంలో ఇన్వెస్టర్లు భయాందోళనకు గురై బిట్‌కాయిన్ వంటి రిస్క్ ఎక్కువగా ఉండే ఆస్తులను విక్రయించి, సురక్షితమైన బంగారం వంటి వాటిపై పెట్టుబడులు పెడుతున్నారు. రెండవది మార్చి 27న ముగిసిన సుమారు 14 బిలియన్ల డాలర్ల విలువైన ఆప్షన్స్ ఎక్స్‌పైరీ. ఈ భారీ ఎక్స్‌పైరీ కారణంగా ట్రేడర్లు తమ పొజిషన్లను క్లోజ్ చేయడం వల్ల మార్కెట్‌లో విపరీతమైన అమ్మకాల ఒత్తిడి ఏర్పడింది. ఇక మూడవది అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఈవట) సమావేశం తర్వాత వడ్డీ

రేట్లు తగ్గకపోవచ్చనే అంచనాలతో రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ బలపడి, క్రిప్టో మార్కెట్ మొత్తం రెడ్ మార్క్‌లో ట్రేడ్ అవుతోంది. దీంతో రానున్న రోజుల్లో బిట్‌కాయిన్ గమనం ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఒకవేళ ప్రస్తుతం ఉన్న 66,000 డాలర్ల వద్దనే నిలబడితే, మార్కెట్ తిరిగి పుంజుకుని 68,000 నుంచి 70,000 డాలర్లకు చేరే అవకాశం ఉంది. కానీ, ఒకవేళ ఈ సపోర్ట్ బ్రేక్ అయితే మాత్రం, ధర నేరుగా 60,000 డాలర్లకు పడిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేవలం బిట్‌కాయిన్ మాత్రమే కాకుండా ఎథరియం, సొలానా వంటి ఇతర ప్రధాన క్రిప్టో కరెన్సీలు కూడా 3 నుండి 5 శాతం మేర నష్టపోవడం వల్ల మార్కెట్ అంతా అనిశ్చితిలో ఉంది. ఇరాన్ చర్చల ఫలితాలు, పెరుగుతున్న చమురు ధరలు, ఫెడ్ తీసుకునే తదుపరి నిర్ణయాల బట్టి బిట్‌కాయిన్ ధరల్లో త్వరలోనే పెను మార్పులు సంభవించే అవకాశం ఉంది.

# పెట్రోల్ బంకుల ద్వారా కిరోసిన్ పంపిణీ



మిడిల్ ఈస్ట్ వార్ నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడటంతో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హార్ముజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాల వల్ల భారతదేశానికి అందాల్సిన ఒఖఉ దిగుమతులు దాదాపు 50 శాతం మేర పడిపోయాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దేశీయంగా వంట గ్యాస్ కొరత ఏర్పడకుండా పెట్రోలియం భద్రతా మరియు లైసెన్సింగ్ నిబంధనలను తాత్కాలికంగా సడలిస్తూ కేంద్రం ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా గతంలో నిలిపివేసిన పి.డి.ఎస్ (ఖఆూ) కిరోసిన్ పంపిణీని తిరిగి పునరుద్ధరించడమే కాకుండా, దానిని ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల ద్వారా కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ప్రకారం.. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి 21 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ సడలింపులు వర్తిస్తాయి. సాధారణంగా రేషన్ షాపులకే పరిమితమయ్యే కిరోసిన్, ఇప్పుడు ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లో కూడా లభ్యం కానుంది. గ్యాస్ సిలిండర్ల కొరత భయాల నేపథ్యంలో తక్కువ ఆదాయ వర్గాలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కిరోసిన్‌ను ఒక ప్రత్యామ్నాయ ఇంధనంగా అందుబాటులో ఉంచడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ తాత్కాలిక ఏర్పాటు సుమారు 60 రోజుల పాటు అమలులో ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం అదనంగా 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేటాయించింది. గృహ అవసరాలకు కిరోసిన్‌ను వాడుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా వంటింట్లో గ్యాస్ వినియోగంపై ఒత్తిడిని తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే కాలుష్య కారకమైన కిరోసిన్ వాడకాన్ని తగ్గించి, పైప్డ్ నేచురల్ గ్యాస్(ఖఔఉ) వైపు ప్రజలను మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, యుద్ధం వంటి అత్యవసర పరిస్థితుల్లో సామాన్యులను ఆదుకోవడమే ప్రథమ కర్తవ్యంగా ప్రభుతం ఈ చర్యలు చేపట్టింది.


# కంపెనీలూ చర్యలు చేపట్టాలి



పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశీయంగా తలెత్తిన అంతరాయాలను చక్కదిద్దేందుకు, మన ప్రభుత్వం వేగంగా ప్రతిస్పందించి నందుకు భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆదివారం కృతజ్ఞతలు తెలిపింది. సరఫరా వ్యవస్థలు సక్రమంగా పని చేసేలా చూడటం, ఎగుమతిదార్లకు మద్దతు ఇవ్వడం, కుటుంబాలను కాపాడటం, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని రక్షించడంపై ప్రభుత్వం సారించిందని వివరించారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించడానికి, పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగడానికి, ఉద్యోగాల రక్షణకు, జీవనోపాధికి ప్రభుత్వం మద్దతు ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వ చర్యలకు తోడు, దేశీయ కంపెనీలు కూడా తగిన విధంగా స్పందించాలని 12 సూత్రాలను సీఐఐ తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం-పరిశ్రమల మధ్య నిరంతర సమన్వయం అవసరమని

సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. అయితే సరఫరా వైపు అంతరాయం ఉందని.. ఇంధన – రవాణా వ్యయాలు పెరగడం, వర్కింగ్ క్యాపిటల్‌లో ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు సీఐఐ గమనించిందని బెనర్జీ వెల్లడించారు. పరిశ్రమల నిర్వాహకులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సీఐఐ సూచించింది..

## రేమండ్ మాజీ చైర్మన్ కన్నుమూత



ప్రముఖ పారిశ్రామికవేత్త, రేమండ్ గ్రూప్ మాజీ చైర్మన్ విజయ్‌పథ్ సింఘానియా కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. భారతీయ టెక్స్‌టైల్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలోనూ, రేమండ్ బ్రాండ్‌ను "ద కంప్లీట్ మ్యాన్" అనే నినాదంతో ప్రతి ఇంటికి చేరువ చేసిన ఘనత ఆయనదే కావడం విశేషం. విజయ్‌పథ్ సింఘానియా సారథ్యంలో రేమండ్ గ్రూప్ కేవలం ఒక బట్టల మిల్లు స్థాయి నుండి అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్‌గా ఎదిగింది. నాణ్యత, లేటెస్ట్ ట్రెండ్స్ విషయంలో ఇండియన్ మెన్ ఫ్యాషన్ రంగంలో సింఘానియా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా రిటైల్ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా, విదేశీ మార్కెట్లలో కూడా భారతీయ వస్త్రాలకు గుర్తింపు తెచ్చారు. ఆయన వ్యాపార దక్షతకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2006లో ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. వ్యాపారంతో ఆయన ఎవరూ చేయని సాహసాలు కూడా చేసారు. 1988లో లండన్ నుండి ఢిల్లీ వరకు మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఒంటరిగా ప్రయాణించి ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే, 2005లో 67 ఏళ్ల వయసులో హాట్ ఎయిర్ బెలూన్‌లో అత్యధిక ఎత్తుకు (సుమారు 69,000 అడుగులు) ప్రయాణించి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. ముంబై నగరానికి గౌరవ షెరీఫ్‌గా కూడా ఆయన సేవలందించారు. అయితే వ్యాపారరంగంలో అగ్రస్థానానికి ఎదిగిన సింఘానియా చివరి రోజులు విషాదకరంగా సాగాయి. తన కుమారుడు గౌతమ్ సింఘానియాతో ఏర్పడిన ఆస్తి తగాదాలు, కోర్టు వివాదాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి. తన ఆస్తి మొత్తాన్ని కుమారుడికి రాసిచ్చిన తర్వాత, ఉండటానికి ఇల్లు కూడా లేకుండా అద్దె ఇంట్లో ఉండాల్సి వచ్చిందని ఆయన రాసిన "ఒని ఎనిఇనీఎజూశ్రీవబివ ఒతిటవ" ఆత్మకథలో ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రీకొడుకుల మధ్య సాగిన ఈ న్యాయపోరాటం కార్పొరేట్ ప్రపంచంలో ఒక హెచ్చరికగా మిగిలిపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు. విజయ్‌పథ్ సింఘానియా మృతి పట్ల పారిశ్రామిక, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు



గ్యాస్ ధరలు సామాన్య ప్రజలకు భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ ఉద్రిక్తతల(ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం) కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్(ఒఖఉ) సిలిండర్ ధరలను పెంచాయి. ఈ తరుణంలో ఇంట్లో ఉపయోగించే సాధారణ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 60 పెరిగింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర సుమారు రూ. 965కు చేరుకుంది. హోటల్స్, రెస్టారెంట్లు వాడే 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 115 పెరిగింది. దీంతో కొన్ని హోటల్స్ మూసి వేసుకునే పరిస్థితి నెలకొంది. ఇతర నగరాలతో పోల్చి చూస్తే వరంగల్‌లోనే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రోజు(మార్చి 30) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగారల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

## సెయిల్ నూతన సీఎండీగా అశోక్ కుమార్ పాండా



ప్రభుత్వ రంగ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నూతన చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అశోక్ కుమార్ పాండాను పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ సిఫారసు చేసింది. ప్రస్తుతం సెయిల్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న పాండాకు ఈ సంస్థలో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీఈ పూర్తి చేసి మేనేజ్‌మెంట్ ట్రయినీగా సెయిల్‌లో కెరీర్ ప్రారంభించిన ఆయన బిజినెస్ ఫైనాన్స్‌లో పిహెచ్‌డి కూడా పొందారు. గతంలో ఆయన డైరెక్టర్ (కమర్షియల్)గా అదనపు బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించారు. సెయిల్ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో అశోక్ కుమార్ పాండా కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా డీలెవరేజింగ్ ప్రయత్నాల ద్వారా సంస్థ అప్పులను ఏకంగా రూ.20,000 కోట్ల మేర తగ్గించిన ఘనత ఆయనకు దక్కుతుంది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## ముంచుకొస్తోంది డిజిటల్ డ్రగ్!

టెక్నాలజీ మనిషి జీవితాన్ని సులభతరం చేయాలి. కానీ అదే టెక్నాలజీ మనిషి మెదడును తన గుప్పిట్లోకి తీసుకుని బానిసను చేస్తే? సరిగ్గా ఇదే అంశంపై కాలిఫోర్నియా జ్యూరీ ఇచ్చిన తీర్పు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియా వ్యసనానికి మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్), యూట్యూబ్ వంటి సంస్థలే బాధ్యత వహించాలని కోర్టు స్పష్టం చేస్తూ, 6 మిలియన్ డాలర్ల జరిమానా విధించడం ఒక చారిత్రాత్మక పరిణామం. సోషల్ మీడియా అనేది కేవలం సమాచార మార్పిడి వేదిక మాత్రమే కాదు, అదొక పకడ్బందీగా రూపొందించబడిన 'డిజిటల్ సైకాలజీ'. వినియోగదారుడు యాప్‌ను క్లోజ్ చేయకుండా నిరంతరం స్క్రోల్ చేస్తూనే ఉండేలా చేసే 'ఇన్‌ఫైనైట్ స్క్రోలింగ్', ఆటో-ప్లే ఫీచర్లు యాదృచ్ఛికంగా వచ్చినవి కావు. అవి యూజర్ల మెదడులో డోపమైన్ విడుదలను ప్రేరేపించి, వారిని ఒక రకమైన మత్తులోకి నెట్టేలా డిజైన్ చేయబడ్డాయి. ఈ ఉచ్చులో పడి పసిపిల్లలు తమ సహజత్వాన్ని కోల్పోతున్నారు. ఇప్పటివరకు సోషల్ మీడియా వినియోగాన్ని వ్యక్తిగత అలవాటుగా మాత్రమే చూశాం. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారు అంటే వారి తప్పే అని భావించాం. కానీ ఈ తీర్పు ఆ ఆలోచనను పూర్తిగా మార్చేసింది. వినియోగదారుల బలహీనతలను గుర్తించి, వారిని ఎక్కువసేపు యాప్‌లలోనే ఉంచేలా రూపొందించిన అల్గారిథమ్స్ కూడా ఒక కారణమని కోర్టు స్పష్టం చేసింది. అంటే ఇది కేవలం వినియోగదారుడి తప్పు మాత్రమే కాదు.. ఇది వ్యవస్థపరమైన సమస్య. సోషల్ మీడియా కంపెనీలు రూపొందించిన ఆటోప్లే, ఇన్‌ఫినిట్ స్క్రోలింగ్, నిరంతర నోటిఫికేషన్లు వంటి ఫీచర్లు సాధారణ సాంకేతిక సౌకర్యాలు కావు. అవి మన దృష్టిని బంధించే పద్ధతులు. మన మెదడు డోపమైన్‌పై ఆధారపడేలా చేసే ఒక మానసిక వ్యూహం. ఇది వినోదం పేరుతో వ్యసనాన్ని పెంచే డిజైన్. అందుకే నిపుణులు దీన్ని డిజిటల్ సైకాలజీగా పేర్కొంటున్నారు. ఇక్కడ ముఖ్యంగా ఆందోళన కలిగించే విషయం పిల్లలపై పడుతున్న ప్రభావం. చిన్న వయస్సులోనే సోషల్ మీడియా వినియోగం ప్రారంభమవుతోంది. వాస్తవ ప్రపంచంతో పోల్చితే వర్చువల్ ప్రపంచమే వారికి నిజమైన జీవితం అనిపించే స్థితి వస్తోంది. అందం అంటే ఏమిటి? విజయం అంటే ఏమిటి? సంబంధాలు అంటే ఏమిటి? అన్న భావనలు కూడా సోషల్ మీడియా ప్రభావంతో మారిపోతున్నాయి. దీని ఫలితంగా ఆందోళన, ఒంటరితనం, డిప్రెషన్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఈ సమస్యను వ్యక్తిగత స్థాయి నుంచి సామాజిక స్థాయికి తీసుకువచ్చింది. ఇది ఇక ఒక కుటుంబ సమస్య కాదు. ఇది ఒక ప్రజారోగ్య సమస్య. పొగాకు కంపెనీలపై గతంలో వచ్చిన తీర్పుల మాదిరిగా, ఇప్పుడు సోషల్ మీడియా కంపెనీల బాధ్యతపై కూడా ప్రపంచవ్యాప్తంగా చర్చ ప్రారంభమైంది. ఇది ఒక కొత్త దిశలో ప్రారంభమైన మార్పు.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. మొత్తం బాధ్యత కంపెనీలదేనా? వినియోగదారుల బాధ్యత ఏమిటి? తల్లిదండ్రుల పాత్ర ఏమిటి? సమాధానం సులభం కాదు. కానీ స్పష్టమైన విషయం ఏమిటంటే.. ఇది ఒక సంయుక్త బాధ్యత. కంపెనీలు తమ ప్లాట్‌ఫారమ్‌లను బాధ్యతాయుతంగా రూపొందించాలి. ప్రభుత్వాలు నియంత్రణ చట్టాలు తీసుకురావాలి. తల్లిదండ్రులు పిల్లల డిజిటల్ అలవాట్లపై పర్యవేక్షణ చేయాలి. ముఖ్యంగా వినియోగదారులు తమ సమయాన్ని నియంత్రించుకోవడం నేర్చుకోవాలి. ఈ తీర్పు మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా ఇస్తోంది. సాంకేతికత మన కోసం ఉండాలి.. మనపై ఆధిపత్యం కోసం కాదు. మన జీవితం సులభతరం చేయడానికి వచ్చిన సాధనాలు మన జీవితాన్ని నియంత్రించే స్థాయికి చేరుకుంటే, అది అభివృద్ధి కాదు. అది ప్రమాద సంకేతం. ఇప్పుడు ప్రపంచం ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. సోషల్ మీడియా భవిష్యత్తు ఎలా ఉండాలి? అది లాభాల కోసం పనిచేసే యంత్రంగానే కొనసాగాలా? లేక సమాజానికి మేలు చేసే బాధ్యతాయుత వేదికగా మారాలా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైనది. ఈ నేపథ్యంలో భారతదేశం వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశాలకు ఈ తీర్పు ఒక ముఖ్యమైన హెచ్చరికగా పరిగణించాలి. ఇప్పటికే మన దేశంలో చిన్న వయస్సు పిల్లల నుంచి కాలేజీ యువత వరకు సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగింది. రోజుకు గంటల కొద్దీ ఫోన్‌లకు పరిమితమవుతున్న జీవితం వారి చదువు, వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతున్నది. అయితే ఇప్పటివరకు దీనిని ఒక సామాన్య జీవనశైలి మార్పుగా మాత్రమే చూస్తున్నాం గానీ, ఒక ప్రజారోగ్య సమస్యగా చర్చించలేదు. ఇప్పుడు ఆ దిశగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ప్రత్యేకంగా పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించడం అత్యంత అవసరం. పిల్లలకు సోషల్ మీడియా ప్రయోజనాలు మాత్రమే కాకుండా ప్రమాదాల గురించి కూడా చెప్పాలి. అదే సమయంలో ప్రభుత్వం కూడా వయస్సు పరిమితులు, డేటా రక్షణ, అల్గారిథమ్ పారదర్శకత వంటి అంశాలపై కఠినమైన విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో పలు దేశాలు ఇప్పటికే ఈ దిశగా చర్యలు ప్రారంభించాయి. భారత్ కూడా వెనుకబడకూడదు. సోషల్ మీడియాను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు, అవసరమూ కాదు. కానీ దాన్ని నియంత్రణలో ఉంచే సామాజిక బాధ్యతను మాత్రం విస్మరించలేము. కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఇచ్చిన సందేశం స్పష్టంగా ఒకటే.. సాంకేతికత మనిషి జీవితాన్ని మెరుగుపరచాలి గానీ, మనిషిని తన ఆధీనంలోకి తీసుకోవడానికి కాదు. ఈ సత్యాన్ని గుర్తించే సమాజమే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన డిజిటల్ సంస్కృతిని నిర్మించగలదు. కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఒక కేసుకు మాత్రమే సంబంధించినది కాదు. ఇది డిజిటల్ యుగానికి ఇచ్చిన హెచ్చరిక. మనం ఇప్పటికైనా జాగ్రత్త పడకపోతే, డిజిటల్ డ్రగ్ అనే పదం, పెను ముప్పుగా మారే ప్రమాదం పొంచి ఉంది.

# నిద్రపోయే ముందు పసుపు పాలు తాగితే బాడీలో ఏం జరుగుతుందో తెలుసా?

పసుపు పాలు.. మన ఇంట్లో ఉండే అద్భుతమైన ఔషధం. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి మనం వెంటనే చేసే పని ఇదే. కానీ, ఆరోగ్యకరమైన ఈ పానీయాన్ని మీరు తాగే సమయం లేదా పద్ధతి తప్పైతే.. అది మీ శరీరానికి మేలు చేయడం పక్కన పెడితే, కీడు చేసే అవకాశం ఉంది. శతాబ్దాలుగా భారతీయ ఇళ్లలో పసుపు పాలు ఒక సంప్రదాయ ఔషధంగా కొనసాగుతున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో, గాయాలను మాన్పడంలో, రాత్రిపూట మంచి నిద్రను అందించడంలో దీనికి మించిన చిట్కా లేదని నమ్ముతారు. పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థంలోని యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే ఆరోగ్యకరమైన ఈ పానీయాన్ని తప్పుడు పద్ధతిలో లేదా తప్పుడు సమయంలో తీసుకుంటే శరీరానికి హాని కలుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.చాలా మందికి పసుపు పాలు తాగిన వెంటనే పడుకునే అలవాటు ఉంటుంది. కానీ పాలు జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. పాలు తాగిన వెంటనే నిద్రపోతే జీర్ణక్రియ మందగించి ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి. పడుకోవడానికి

కనీసం 1-2 గంటల ముందే పాలు తాగడం ఉత్తమం. ఎక్కువ పసుపు వాడితే ఎక్కువ ఆరోగ్యం అనుకోవడం పొరపాటు. పసుపును అధికంగా తీసుకోవడం వల్ల కడుపులో అసౌకర్యం, గ్యాస్, కడుపు నొప్పి, కొన్ని సందర్భాల్లో విరేచనాలు కూడా సంభవించవచ్చు. రోజుకు

చిటికెడు లేదా అర స్పూన్ కంటే ఎక్కువ పసుపు వాడకూడదు. కొంతమంది ఖాళీ కడుపుతో పసుపు పాలు తాగుతుంటారు. సున్నితమైన కడుపు ఉన్నవారికి ఇది సరిపడదు. దీనివల్ల కడుపులో చికాకు, ఎసిడిటీ లేదా అసౌకర్యం కలగవచ్చు. పసుపు పాలలోని పూర్తి ప్రయోజనాలు శరీరానికి అందాలంటే ఒక చిన్న చిట్కా పాటించాలి. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో కొద్దిగా నల్ల మిరియాల పొడి కలపండి. మిరియాలు కలపడం వల్ల పసుపులోని కర్కుమిన్‌ను శరీరం త్వరగా గ్రహిస్తుంది.




# మోకాళ్ల నొప్పులకు చెక్ పెట్టాలా?

వెనక్కి నడవడం అనేది వినడానికి వింతగా అనిపించినా, ఇది శరీరానికి, మెదడుకి ఒక సరికొత్త సవాలును విసురుతుంది. మనం రోజూ చేసే పనుల కంటే భిన్నంగా చేయడం లేదా కనీసం ప్రయత్నించడం వల్ల మెదడు మరియు నాడీ వ్యవస్థ వేగంగా స్పందిస్తాయి. ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే మనం చేసే పనులు మన రోజంతా ఎలా గడవబోతుందో నిర్ణయిస్తాయి. సాధారణంగా అందరూ ముందుకు నడవడానికి అలవాటు పడతారు. కానీ, కేవలం 30 సెకన్ల పాటు వెనక్కి నడిస్తే మీ మెదడు, శరీరంపై అద్భుతమైన సానుకూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనిని 'రెట్రో వాకింగ్' అని కూడా పిలుస్తారు. బ్యాలెన్స్, స్టెబిలిటీ : వెనక్కి నడవడానికి ఎక్కువ ఏకాగ్రత, నియంత్రణ అవసరం. ఇది శరీరాన్ని సమతుల్యం చేసే సామర్థ్యాన్ని పెంచుతుంది. ముఖ్యంగా వృద్ధులలో పడిపోయే ప్రమాదాలను తగ్గిస్తుంది.కొత్త కండరాల ఉత్తేజం : ముందుకు నడిచేటప్పుడు పెద్దగా పని చేయని కండరాలు వెనక్కి నడిచేటప్పుడు యాక్టివ్ అవుతాయి. దీనివల్ల లోయర్ బాడీ స్ట్రెంగ్త్ పెరుగుతుంది.మోకాళ్ల నొప్పుల నివారణ : ఫిజియోథెరపీలో దీనిని ఒక చికిత్సగా వాడతారు. ఇది మోకాళ్లపై ఒత్తిడిని తగ్గించి, కీళ్ల కదలికను మెరుగుపరుస్తుంది. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఇది ఎంతో మేలు చేస్తుంది. మానసిక శక్తి.. వెనక్కి నడవడం అనేది ఒక రొటీన్ ప్రక్రియ కాదు. కాబట్టి మెదడు ఈ కొత్త కదలికలను అర్థం చేసుకోవడానికి ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది. ఇది మెదడుకు ఒక చిన్న వర్కవుట్ లాంటిది. దీనివల్ల జ్ఞాపకశక్తి



పెరుగుతుంది, ఫోకస్ మెరుగవుతుంది, ఏదైనా విషయాన్ని వేగంగా గ్రహించే శక్తి పెరుగుతుంది. వెనక్కి నడవడం అనేది ముందుకు నడవడం కంటే కొంచెం కష్టమైన పని. కాబట్టి తక్కువ సమయంలోనే ఎక్కువ క్యాలరీలు బర్న్ అవుతాయి. ఇది హృదయ స్పందన రేటును పెంచి, బరువు తగ్గాలనుకునే వారికి సహాయపడుతుంది. అలాగే, రోజంతా వంగి కూర్చునే వారికి, ఈ నడక వల్ల శరీరం నిటారుగా మారి సరైన 'పోశ్చర్' వస్తుంది.

# జలుబు ఉన్నప్పుడు మజ్జిగ తాగితే..



సాధారణంగా ఇంట్లో ఎవరికైనా జలుబు లేదా దగ్గు వచ్చిందంటే, వెంటనే డైనింగ్ టేబుల్ నుండి పెరుగు, మజ్జిగ మాయమైపోతాయి. ఇవి తీసుకుంటే జలుబు ఇంకా ఎక్కువవుతుందని చాలా మంది నమ్ముతుంటారు. అయితే ఇందులో ఎంతవరకు నిజం ఉందో శాస్త్రీయ కోణంలో విశ్లేషిస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. మజ్జిగలోని వే ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషణను అందిస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం.. పులియబెట్టిన పాల ఉత్పత్తులు శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. వైద్యపరంగా చూస్తే.. జలుబు, దగ్గులు ప్రధానంగా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తాయి. ఆహారం నేరుగా ఈ వ్యాధులను తీవ్రతరం చేస్తుందనడానికి ఎటువంటి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పి. ప్రవీణ్ కుమార్ రెడ్డి వివరణ ప్రకారం.. మజ్జిగను పూర్తిగా మానుకోవాల్సిన అవసరం లేదు, పైగా అది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మజ్జిగ తాగాలనుకునే వారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. నేరుగా ఫ్రిజ్ నుండి తీసిన చల్లని మజ్జిగ తాగడం వల్ల గొంతు చికాకుకు గురై దగ్గు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న మజ్జిగనే వాడాలి. మజ్జిగలో అల్లం, మిరియాలు, జీలకర్ర వంటివి కలపడం వల్ల అది జీర్ణక్రియకు తోడ్పడటమే కాకుండా, శరీరానికి హాయినిస్తుంది. అయితే రాత్రి సమయాల్లో కంటే, మధ్యాహ్న భోజన సమయంలో మజ్జిగ తీసుకోవడం ఉత్తమం. అయితే అందరి శరీర తత్వాలు ఒకేలా ఉండవు. మీకు తీవ్రమైన గొంతు నొప్పి, టాన్సిల్స్ వాపు లేదా జలుబు తీవ్రంగా ఉన్నప్పుడు కొన్ని రోజుల పాటు మజ్జిగకు దూరంగా ఉండటమే మంచిది. అలాగే, మజ్జిగ తాగిన వెంటనే లక్షణాలు పెరుగుతున్నట్లు అనిపిస్తే మీ వ్యక్తిగత సున్నితత్వాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలి. జలుబు లేదా దగ్గు ఎక్కువ కాలం తగ్గకుండా వేధిస్తుంటే, అది ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. అటువంటప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవడం అవసరం.

# అజీర్తికి చెక్ పెట్టే అద్భుతమైన ఆకులు!

మన చుట్టూ ప్రకృతి ప్రసాదించిన అనేక మొక్కలు ఔషధ గుణాలను కలిగి ఉన్నాయి. ముఖ్యంగా మనకు ఈజీగా లభించే కొన్ని రకాల ఆకులు చర్మ సమస్యలకు, జీర్ణక్రియకు అద్భుతమైన పరిష్కారంగా పనిచేస్తాయి. రసాయనాలతో కూడిన ఉత్పత్తుల కంటే, ఇంట్లోనే లభించే ఈ సహజసిద్ధమైన ఆకులను ఉపయోగించడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ఆరోగ్యాన్ని, అందాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ప్రస్తుత కాలంలో కాలుష్యం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల చర్మ సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు సర్వసాధారణం అయ్యాయి. వీటికి ఖరీదైన మందులు వాడటమే కాకుండా, మన వంటింట్లో లేదా పెరట్లో దొరికే కొన్ని పచ్చని ఆకులతో శాశ్వత పరిష్కారం పొందవచ్చు. వేపను 'సర్వరోగ నివారిణి' అని పిలుస్తారు. ఇందులో యాంటీ-ఫంగల్, యాంటీ-బ్యాక్టీరియల్ గుణాలు మెండుగా ఉంటాయి. వేప ఆకులను పేస్ట్‌లా చేసి మొటిమలపై రాస్తే అవి త్వరగా తగ్గిపోతాయి. చర్మంపై వచ్చే వేడి గడ్డలు, ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో వేప అద్భుతంగా పనిచేస్తుంది. తులసి కేవలం పవిత్రమైన మొక్క మాత్రమే కాదు, గొప్ప ఔషధం కూడా. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. తులసి రసాన్ని ముఖానికి రాయడం వల్ల చర్మంపై ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. మొటిమల మచ్చలు కూడా తగ్గుతాయి. పుదీనా చర్మానికి చల్లదనాన్ని ఇస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వాత పుదీనా ఆకులను నమలడం లేదా పుదీనా టీ తాగడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం తగ్గుతాయి. ఇది చర్మంలోని అదనపు నూనెను తొలగించి మొటిమలు రాకుండా చూస్తుంది. కరివేపాకును కేవలం పోపు కోసమే కాకుండా ఆరోగ్య కోసమూ వాడాలి. ఉదయాన్నే పరగడుపున కరివేపాకులను నమలడం వల్ల జీర్ణక్రియ వేగవంతమై బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. ఇందులో ఉండే యాంటీ

ఆక్సిడెంట్లు చర్మ కణాలను రక్షిస్తాయి. కొత్తిమీరలో విటమిన్ సి, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా రక్తం శుద్ధి జరిగి చర్మం కాంతివంతంగా మారుతుంది. ఈ ఆకులను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకోవడం లేదా ప్యాక్స్‌గా వాడటం ద్వారా మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. అయితే, ఏదైనా కొత్త చిట్కా పాటించే ముందు చర్మంపై ప్యాచ్ టెస్ట్ చేయడం లేదా నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.

# సూర్యవంశీ వీరబాదుడు... సీఎస్కేపై రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (52; 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, చెన్నై సూపర్ కింగ్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేవలం 12.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యవంశీ ఆడిన తీరు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.


ఛేజింగ్ లో రాజస్థాన్‌కు, చెన్నై బౌలర్లను ఎదుర్కోవడం పెద్ద కష్టంగా అనిపించలేదు. ముఖ్యంగా ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే బాదుడు మొదలుపెట్టాడు. క్రీజులోకి వచ్చిన కాసేపటికే బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 17 బంతుల్లోనే 305.88 స్ట్రైక్ రేట్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసి చెన్నై శిబిరాన్ని నిరాశకు గురిచేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్థాన్ స్కోరు 74 పరుగులకు చేరిందంటే వైభవ్ విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తొలి వికెట్‌కు యశస్వి జైస్వాల్‌తో కలిసి కేవలం 38 బంతుల్లోనే 75 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. సూర్యవంశీ ఔటైన తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ (18; 9 బంతుల్లో) కూడా వేగంగా ఆడాడు. మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ (38 నాటౌట్; 36 బంతుల్లో) నిలకడగా ఆడి, కెప్టెన్ రియాన్ పరాగ్ (14 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. అంతకుముందు, రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. నిర్ణీత 20 ఓవర్లు కూడా ఆడకుండా 19.4 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. సంజూ శాంసన్ (6), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (6) సహా టాపార్డర్ పూర్తిగా విఫలమైంది. ఒక దశలో 57 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో జేమీ ఓవర్టన్ (43; 36 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేయడంతో చెన్నై ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నండ్రే బర్గర్, రవీంద్ర జడేజా తలో రెండు వికెట్లు పడగొట్టి చెన్నై పతనాన్ని శాసించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాజస్థాన్ ఈ సీజన్‌లో తమ జైత్రయాత్రను ఘనంగా ప్రారంభించింది.

# ఐపీఎల్ పోరు.. శుభ్‌మన్ X శ్రేయస్



ముల్లాన్‌పుర్: ఐపీఎల్-19లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. మంగళవారం జరిగే మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్.. గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, గుజరాత్ సారథి శుభ్‌మన్ గిల్‌పైనే అందరి దృష్టి ఉంది. భారత టీ20 జట్టులో లేని ఈ ఇద్దరు స్టార్లు.. ఐపీఎల్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. గతేడాది శ్రేయస్ సారథ్యంలో ఫైనల్‌కు వచ్చి.. ఆఖరి మెట్టుపై తడబడిన పంజాబ్.. ఈ సీజన్లో ఎలా ఆడుతుందనేది ఆసక్తికరం. బ్యాటర్‌గానూ శ్రేయస్ రాణించడం ఆ జట్టుకు ఎంతో కీలకం. గతేడాది అతడు 50పైన సగటుతో 604 పరుగులు చేశాడు. ఈ ఏడాది న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడిన శ్రేయస్‌కు టీ20 ప్రపంచకప్‌లో పోటీపడిన భారత జట్టులో చోటు దక్కలేదు. 2022లో అరంగేట్ర సీజన్లోనే టైటిల్‌ను అందుకుని.. తర్వాతి ఏడాది రన్నరప్‌గా నిలిచిన గుజరాత్ ఆ తర్వాత ఆ స్థాయి ప్రదర్శన చేయలేకపోతోంది. హార్దిక్ పాండ్య ముంబయికి వెళ్లిపోవడంతో 2024లో పగ్గాలు అందుకున్న శుభ్‌మన్.. గత సీజన్లో జట్టును బాగానే నడిపించాడు. అతడి సారథ్యంలో గుజరాత్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించినా.. ఎలిమినేటర్‌లో ఓడి నాలుగో స్థానంలో నిలిచింది. బ్యాటర్‌గా శుభ్‌మన్ స్థిరంగానే ఆడుతున్నా.. స్ట్రైక్‌రేటే సమస్యగా ఉంది. టీ20 కెరీర్ స్ట్రైక్‌రేట్ 138గా ఉన్న శుభ్‌మన్.. గతేడాది ఐపీఎల్‌లో 155 స్ట్రైక్‌రేట్‌తో 15 మ్యాచ్‌ల్లో 650 పరుగులు చేశాడు. అతడు భారత టీ20 జట్టులో స్థానం ఆశిస్తే మరింత వేగంగా ఆడక తప్పదు.

# చీరకట్టులో గ్లామర్ డోస్ పెంచేసిన ప్రభాస్ బ్యూటీ!



బాలీవుడ్ సెన్సేషన్, నేషనల్ క్రష్ త్రిప్తి డిమ్రి తన అందచందాలతో మరోసారి ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇవి పాత జ్ఞాపకాలుగా మారకముందే అప్‌లోడ్ చేస్తున్నాను అంటూ షేర్ చేసిన చీరకట్టు ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తూనే, తనదైన స్టైల్‌లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేస్తోంది ఈ భామ. 'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

**త్రిప్తి సక్సెస్ జర్నీ:**

త్రిప్తి డిమ్రి సినీ ప్రయాణం 2017లో 'పోస్టర్ బాయ్' చిత్రంతో మొదలైంది. ఆ తర్వాత వచ్చిన రొమాంటిక్ డ్రామా 'లైలా మజ్నూ'లో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కేవలం అందానికే పరిమితం కాకుండా, ప్రతిభావంతురాలైన నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఇక 2021లో ఫోర్బ్స్ ఆసియా '30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించుకోవడం ఆమె కెరీర్‌లో ఒక పెద్ద మైలురాయి. ఇక కష్టపడి పైకి వచ్చిన త్రిప్తి, ఇప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. ఆమె ఎంపిక చేసుకునే కథలు, నటనలోని వైవిధ్యం ఫాన్స్ ను అలరిస్తున్నాయి.

సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన అభిమానులను పలకరించడం త్రిప్తి మర్చిపోదు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన చీరకట్టు ఫో టోలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి. ఫ్యాషన్ డ్రెస్ లో ఎంత బోల్డ్‌గా కనిపిస్తుందో, చీరలో అంతటి హోయలు ఒలికిస్తూ కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. ఇక ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు స్టన్నింగ్ బ్యూటీ అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. పాత జ్ఞాపకాలుగా మారకముందే తన అందాలను ఫ్యాన్స్‌కు షేర్ చేసి, మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది ఈ స్పిరిట్ బ్యూటీ.

**ప్రభాస్ 'స్పిరిట్'లో త్రిప్తి:**

రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌లో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా సినిమాలంటేనే హీరో-హీరోయిన్ల మధ్య ఘాటు రొమాన్స్, బోల్డ్ సీన్స్ మరియు ఇంటెన్స్ లిప్ కిస్సులు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక 'యానిమల్'లో తన గ్లామర్‌తో కుర్రాళ్ల గుండెల్లో సెగలు పుట్టించిన త్రిప్తి, ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేయబోతుందోనని ఫ్యాన్స్ అప్పుడే లెక్కలు వేస్తూ మూవీ కోసం ఎదురుచూస్తున్నారు.



**సోనమ్ బజ్వా ఫ్లోరల్ కార్సెట్ గౌన్‌లో సొగసును ప్రసరిస్తుంది**

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com